క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీ (అతిథి అధ్యాపకులు) నియామకాలు జరుపుతున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. బీబీఏ (ఈ–కామర్స్, సైకాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సంబంధిత అభ్యర్థులు ఈ నెల 12న సాయంత్రం 5 గంటల్లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందించాల్సి ఉంటుందన్నారు. 15న ఉదయం 9.30 గంటలకు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

సత్కారం

సికింద్రాబాద్: నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆ పార్టీ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎస్.గౌతమ్‌రావును బుధవారం ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, మహిళా నాయకురాలు కీర్తి హర్షకిరణ్ నేతృత్వంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలివెళ్లిన పార్టీ నాయకులు గౌతమ్‌రావుకు వెంకటేశ్వర స్వామి విగ్రహ చిత్రాన్ని బహూకరించి, సన్మానించారు. లష్కర్ బీజేపీ నాయకులు కనకట్ల హరి, ప్రభుగుప్తా, కన్నాభిరామ్, ప్రకాష్‌గౌడ్, శ్రీధర్‌రావు, హనుమంతు ముదిరాజ్, రాజేష్ ముదిరాజ్, దేవుడు కుమార్, సత్యనారాయణ, ఈ ఎల్ ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

బొల్లారం: తిరుమలగిరి ప్రాంతానికి చెందిన షశాంక్ పసుపులేటికి కాంగ్రెస్ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ విభాగం కోఆర్డినేటర్‌గా అయనను అధికారికంగా నియమిస్తూ, ఈ నియామకాన్ని టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ విభాగం చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ధృవీకరించారు. తన నియామకంపై స్పందించిన శశాంక్ పసుపులేటి స్పందిస్తూ మహిళల భద్రత, మౌలిక హక్కుల పరిరక్షణ, ఆర్టీఐ అవగాహన కల్పించడంలో నిబద్ధంగా పనిచేస్తాను. పొన్నం అశోక్‌గౌడ్, డాక్టర్ కోట నీలిమా మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ విలువలకు అనుగుణంగా నాకృషిని కొనసాగిస్తానని తెలిపారు.

ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభం

– స్పందించిన అధికారులు



అడ్డగుట్ట: డివిజన్ పరిధిలో అనేక బస్తీలు, ప్రధాన రహదారుల్లో రోడ్లన్నీ దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆ మార్గాన రాకపోకలు సాగించే స్థానికులతో పాటు వాహనదారులు, పాదచారులు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం 'సాక్షి' దినపత్రికలో 'అధ్వానంగా రహదారులు' అంటూ కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు డీఈ పద్మలత, ఏఈ ఆశిష్ తివారీలు అడ్డగుట్ట, తుకారాంగేట్, సీ సెక్షన్, వెంకట్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. దెబ్బతిని, గుంతలమయంగా మారిన రోడ్లన్నింటికీ ప్యాచ్ వర్క్‌పనులు చేయించారు. దశలవారీగా అన్ని బస్తీలు, ప్రధాన రోడ్లలో పర్యటిస్తున్నామన్నారు. అవసరమున్న చోట్ల రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేయిస్తున్నామని డీఈ పద్మలత తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌నగర్ ప్రాంతానికి చెందిన రేణుక 29 ప్రైవేట్ ఉద్యోగిని. ఈ నెల 1న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె మళ్లీ తిరిగి రాలేదు. ఎంతసేపటికీ కూతురు తిరిగి రాకపోవడంతో తండ్రి నరసింహ ఆమెకు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తెలిసిన వారిని వాకబు చేసినా, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకి తెలియకపోవడంతో వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారులో మంటలు



బొల్లారం: బొల్లారం చెక్ పోస్ట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై ప్రయాణిస్తున్న కారులో మంటలు చెలరేగాయి. కొంపల్లికి చెందిన వ్యక్తి తన ఫోర్డ్ ఈకో స్పోర్ట్స్ కారులో శామీర్‌పేట్ వైపు నుంచి వస్తుండగా, ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని పక్కన ఆపేలోపే మంటలు మరింతగా వ్యాపించాయి. ఈ సంఘటన ఆర్మీ ఏరియాలో జరగడంతో సమాచారం అందుకున్న ఆర్మీ అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను అదుపు చేశారు.

పట్టణ ప్రణాళిక తీరు మారేనా?

- చైన్‌మెన్ల సామూహిక బదిలీలు
- గృహ నిర్మాణాలకు వీడిన గ్రహణం
- లష్కర్ నిర్మాణ దారుల్లో హర్షం


సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ చైన్‌మెన్‌లను కొద్ది రోజుల క్రితం సామూహిక బదిలీలు చేశారు. చైన్‌మెన్ల మూకుమ్మడి బదిలీలతో ఈ ప్రాంత గృహనిర్మాణ దారులకు గ్రహణం వీడినట్టు అయింది. టౌన్ ప్లానింగ్ అధికారులు సికింద్రాబాద్ ప్రాంతంలో నిలకడగా పనిచేయకపోతుండటం, పర్యవేక్షకుల నియామకం జరగకపోవడం, ఇన్‌చార్జి అధికారులల నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ వ్యవహారాలు కొనసాగుతుండడంతో ఈ ప్రాంత పట్టణ ప్రణాళిక పరిస్థితులు అస్తవ్యస్తమయ్యాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో టౌన్‌ప్లానింగ్ వ్యవహారాలన్నీ చైన్‌మెన్ల (మున్షీ)ల కనుసన్నల్లోనే కొనసాగుతుండేవి. పదేళ్లుగా ఈ ప్రాంతంలో బదిలీలు లేకుండా తిష్ట వేసిన పది మంది వరకు చైన్‌మెన్‌లు గృహ నిర్మాణదారులను భయభ్రాంతులకు గురిచేసేవారు.

తరచూ అధికారుల బదిలీలతో..

సికింద్రాబాద్ ప్రాంతానికి ఇద్దరు మున్సిపల్ టౌన్ ప్లానర్లు, కనీసం ఐదుగురు సెక్షన్ ఆఫీసర్లు ఉండాల్సిన అవసరం ఉంది. ఇందులో సెక్షన్ ఆఫీసర్లు ఒక్కరు ఇద్దరికి మించి విధుల్లో ఉండడం లేదు. బదిలీలు ఇతరత్రా కారణాలతో సెక్షన్ ఆఫీసర్లు ఇక్కడి నుంచి రిలీవ్ అవుతున్నా వారి స్థానాలను భర్తీ చేయడం లేదు. ఉండాల్సిన ఇద్దరు మున్సిపల్ టౌన్ ప్లానర్లు కూడా పర్మినెంట్‌గా ఉండడం లేదు. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన జీహెచ్ఎంసీ సర్కిళ్లకు చెందిన టౌన్‌ప్లానింగ్ అధికారులను ఇక్కడ ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు ఈ ప్రాంతంపై ఎక్కువ సమయం కేటాయించ పోవడంతో చైన్‌మెన్‌లే ఇక్కడ టౌన్‌ప్లానర్లు అన్న చందంగా పరిస్థితి మారింది.

గృహనిర్మాణ దారులు బెంబేలు...

- బహుళ అంతస్తులు ఇతరత్రా భారీ భవన నిర్మాణ దారులకు వెన్నుదన్నుగా నిలిచే చైన్‌మెన్‌లు చిన్నపాటి వ్యక్తిగత గృహాల నిర్మాణ దారులకు మాత్రం నిబంధనల పేరిట భయభ్రాంతులకు గురిచేసేవారు. వారు అడిగినంత ముట్టజెప్పని వారి నిర్మాణాలను కూల్చివేసేంత వరకు వదిలేది లేదన్నట్టు వ్యవహరించేవారు.
- భారీ, బహుళ అంతస్తుల నిర్మాణదారులు మాత్రం అందినంత ముట్టజెప్పుతున్న నేపథ్యంలో సదరు భవనాలకు మొత్తం అనుమతులు లేకున్నా చూసీచూడనట్టు వ్యవహరించేవారు. పదేళ్లుగా సికింద్రాబాద్ ప్రాంతంలో తిష్టవేసిన చైన్‌మెన్లు అధికారులను సైతం శాసించే స్థాయికి ఎదిగారు. యూనియన్ లీడర్ల పేరుతో కొందరు చైన్‌మెన్లు పై స్థాయి అధికారులను దబాయించేవారు. ఇంకొందరు చైన్‌మెన్లు వ్యక్తిగత సహాయకులుగా ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని అన్ని వ్యవహారాలు వారితో పూర్తిచేయించుకునే వారు.

ప్రక్షాళనపై ఆశలు

సికింద్రాబాద్ ప్రాంతానికి ఒకవైపు ప్రత్యేక అధికారులను నియమించడం, ఆపై చైన్‌మెన్ల వ్యవస్థను ఆసాంతం ప్రక్షాళన చేయడంతో లష్కర్ ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. కొత్త అధికారులు, కొత్త చైన్‌మెన్ల నేతృత్వంలో సికింద్రాబాద్ ప్రాంత టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ప్రక్షాళన అవుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అక్రమ నిర్మాణ ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవడంతో పాటు, పురాతన శిథిల భవనాలు, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ వంటి విషయాల్లో సత్వర చర్యలు ఉంటాయని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు.

ఇబ్బందులు తొలగిస్తాం

గృహనిర్మాణ దారుల ఇబ్బందులు తొలగిస్తాం. జీహెచ్ఎంసీ నిబంధనలకు లోబడిన నిర్మాణాలు మాత్రమే కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాల విషయంలో ఆయా ప్రాంతాల ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు సత్వర ఫిర్యాదులు చూపేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని అప్రమత్తం చేస్తాం. చైన్‌మెన్ల నుంచి నిర్మాణదారులకు బెదిరింపులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఇళ్ల అనుమతుల విషయంలోనూ దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని తొలగిస్తాం.

– పావని, సర్కిల్ టౌన్‌ప్లానర్

మూకుమ్మడి బదిలీలు

చాలా కాలం తర్వాత సికింద్రాబాద్ ప్రాంతానికి ప్రత్యేకంగా టౌన్‌ప్లానర్లను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నియమించారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల నియామకం జరిగిన కొద్ది రోజులకే మొత్తంగా చైన్‌మెన్‌ల బదిలీలు జరిగాయి. ఈ ప్రాంతంలో చైన్‌మెన్‌లుగా పదేళ్లుగా పనిచేసిన అందరినీ పాతబస్తీకి బదిలీ చేశారు. వారి స్థానంలో అందరు కొత్త చైన్‌మెన్ల నియామకం జరిగింది.

నవరాత్రుల వ్యర్థాల తరలింపు

రహదారులు శుభ్రం చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



సికింద్రాబాద్: గణపతి నిమజ్జనం పూర్తయి నాలుగు రోజులు అయినా పారిశుద్ధ్య కార్మికులకు విశ్రాంతి లభించడం లేదు. మండపాల తొలగింపు, నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో టన్నుల కొద్ది చెత్తచెదారాలు పేరుకుపోయాయి. మండపాల తొలగింపుతో అంతర్గత రహదారులు, ఊరేగింపులతో పూలు, మొక్కలు, ఆకులు, తడికెల వ్యర్థాలతో నిండిపోయాయి. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో గణపతి నవరాత్రి వేడుకల సందర్భంగా కుప్పలుగా పేరుకుపోయిన చెత్తచెదారాలను ఊడ్చడం, బయటకు తరలించడం భారంగా మారుతుంది. నాలుగు రోజులుగా 570 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు రహదారులను శుభ్రం చేయడం, చెత్తను బయటకు తరలించడం కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నారు. చెత్త, వ్యర్థాలను బయటికి తరలిస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులు ఆయా ప్రాంత రహదారుల్లో మందులను పిచికారీ చేస్తున్నారు. నిమజ్జన వ్యర్థాలు బయటకు తరలిస్తామని అధికారులు చెబుతున్నారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న టీయూజేఏసీ నాయకులు

అడ్డగుట్ట: ఉద్యమకారుల డిమాండ్ల సాధనకై ఈ నెల 12న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న టీయూజేఏసీ ఉద్యమకారుల మహాధర్నాను జయప్రదం చేయాలని కమిటీ చైర్మన్ ఎస్.యాదగిరి పలుపునిచ్చారు. బుధవారం తుకారాంగేట్‌లోని కార్యాలయం వద్ద కరపత్రం ఆవిష్కరించారు. డిమాండ్ల సాధనకై సెప్టెంబర్ 12న నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, మల్లేశం, బాబన్న, డోలక్ యాదగిరి, చంద్రకళ, పావని, కమల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిని కలిసిన గ్రూప్- 1 అభ్యర్థులు



లాలాపేట: గ్రూప్ 1 అభ్యర్థుల న్యాయమైన హక్కులను కాపాడేలా తాము ఎల్లప్పుడూ మద్దతుగా నిలుబడుతాయనీ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు అన్నారు. గ్రూప్ 1 ప్రశ్నాపత్రాలను రీ వాల్యుయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గ్రూప్ 1 అభ్యర్థులు పలువురు తార్నాకలో రామ్‌చందర్‌రావును కలిశారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం జరిగేలా బీజేపీ చేసిన పోరాటాల ఫలితంగా హైకోర్టు తీర్పుపై వెలువరించిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. బీజేపీకి, రామ్‌చందర్‌రావుకు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కనీసం ఒక్క ఉద్యోగ పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలేకపోయారని విమర్శించారు.

ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం


కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చేస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: అర్హులందరికీ ఆహార భద్రతతో పాటు ఆరోగ్య సంరక్షణ కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ అన్నారు. బేగంపేట డివిజన్ పాటిగడ్డలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. బేగంపేట మహిళా కాంగ్రెస్ నాయకులు తస్లీమ్, బుష్రాల ఆధ్వర్యంలో పలువురికి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విశాల్ సూదం, దేవేందర్, నసీర్ అద్నా, కృష్ణ, నవాజ్, మోహిత్, పర్వేజ్, సబా, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆరో వార్డు కార్తీక్ ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన పార్కు ప్రారంభోత్సవంలో బోర్డు సభ్యురాలు భానుక నర్మదతో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాలనీ వాసులు రూ.13 లక్షల సొంత నిధులతో పార్కును అభివృద్ధి చేసుకోవడం అభినందనీయం అన్నారు. కాలనీవాసుల కోరిక మేరకు డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లను ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. బోర్డు సభ్యురాలు భానుక నర్మద చొరవతో కంటోన్మెంట్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలతో నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ కృషి మరువలేనిదని కొనియాడారు.

–సికింద్రాబాద్ /కంటోన్మెంట్/సనత్‌నగర్ జోన్ బృందం


లాలాపేట: చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు


కంటోన్మెంట్: నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్


తార్నాకలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కార్తీకచంద్రారెడ్డి

క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడొద్దు

గాంధీఆస్పత్రి: క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడి, కుటుంబ సభ్యులకు తీరని మనోవేదనకు గురి చేయవద్దని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గాంధీఆస్పత్రి, కళాశాలల ప్రాంగణాల్లో చైతన్యర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారం ఆత్మహత్య కాదని, ధైర్యంగా ఎదుర్కొని పోరాడాలన్నారు. యువత ఆత్మనూన్యతభావంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, సూసైడ్ థాట్ ఉన్నవారిని గుర్తించి సైకియాట్రి వైద్యులతో కౌన్సిలింగ్ ఇప్పించాలని సూచించారు. అనంతరం 'చేంజింగ్ ది నేరేటివ్ ఆన్ సూసైడ్' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ అనుపమ, వైద్యులు సురేష్, కృష్ణచైతన్య, జాహ్నవి, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్‌గౌడ్, పీజీ వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సనత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించగా, అప్పటికే మరణించి ఉన్నట్లు తెలుసుకున్నారు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. చాలాకాలంగా అనారోగ్యంతో, ఆహారం తినక మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సంబంధీకులు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఐఐసీటీలో ప్రారంభమైన ఆర్‌అండ్‌డీ సదస్సు

లాలాపేట: సీఎస్ఐఆర్–ఐఐసీటీలో సులభంగా పరిశోధన, అభివృద్ధి అనే అంశంపై(ఈజీ ఆఫ్ డూయింగ్ ఆర్‌అండ్‌డీ) 6వ ప్రాంతీయ సంప్రదింపుల రెండు రోజుల సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో నీతీ ఆయోగ్ సీనియర్ అడ్వయిజర్ ప్రొఫెసర్ వివేక్‌కుమార్ సింగ్ హాజరై జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ 2047 కోసం కావాల్సిన పరిశోధనలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అశుతోష్‌శర్మ, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డా. ఎన్. కలైసెల్వి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో దాదాపు 90 మంది వివిధ సంస్థల డైరెక్టర్లు, విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లి

- అమ్మను వెతుక్కుంటూ వెళ్లిన కుమార్తె
- తిరిగిరాని తల్లీకూతుళ్లు..

సనత్‌నగర్: భర్తతో గొడవ జరగడంతో భార్య, ఆమెను వెతుక్కుంటూ వెళ్లిన కుమార్తె ఇంటికి తిరిగిరాని సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ బ్రిగేడ్ సిటాడెల్ డీ–బ్లాక్‌లో నివసించే భూషణ్‌కుమార్, ప్రభావతి (42)లు భార్యాభర్తలు, వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. కుటుంబ విషయంలో ఈ నెల 7న మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భార్యాభర్తలిరువురికీ గొడవ జరిగింది. మరుసటి రోజు 8న మధ్యాహ్నం 1న ప్రభావతి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే తల్లి కోసం కుమార్తె కూడా వెళ్లింది. ప్రభావతితో పాటు కుమార్తె కూడా ఇంటికి తిరిగిరాకపోవడంతో భూషణ్‌కుమార్ పలుచోట్ల గాలించాడు. ప్రయోజనం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూలో భావ్‌నగర్ యూనివర్సిటీ బృందం పర్యటన



లాలాపేట: గుజరాత్‌లోని మహారాజా కృష్ణకుమార్ సింగ్‌జీ భావ్‌నగర్ యూనివర్సిటీకి చెందిన అకాడమిక్ బృందం బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్‌తో సమావేశం అయ్యారు. 108 ఏళ్ల యూనివర్సిటీ చరిత్ర, మౌలిక వసతులు, వ్యవస్థాగత విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వీసీ వివరించారు. యూనివర్సిటీ సాధించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భావ్‌నగర్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ దిలీప్ బరాద్, ఎస్ఈపీ కోఆర్డినేటర్ ప్రొ జే.పీ మెహతా, ప్రొఫెసర్ టీపీ జోషీ, విపుల్ పురోహిత్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా. బీబీ జానీ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో 'కంటోన్మెంట్ వాణి'

కంటోన్మెంట్: కంటోన్మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'కంటోన్మెంట్ వాణి' చేపట్టామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం, కంటోన్మెంట్ పరిధిలోని వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ చరిత్రలోనే మొదటిసారిగా వినూత్న కార్యక్రమం నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కంటోన్మెంట్ బోర్డు అధికారులు ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఒకే వేదిక వద్దకు రావడంతో నియోజకవర్గంలోని అన్ని వార్డుల ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చి తమ సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. తమ కార్యాలయ సిబ్బంది ఆయా ఫిర్యాదులన్నింటినీ రికార్డు చేసుకొని అధికారులకు అందజేశారు. తదుపరి విడుతలో ఆయా సమస్యలు పూర్తిస్థాయిలో పరిస్కారమయ్యేలా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కంటోన్మెంట్ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని, నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సన్మానం

బౌద్ధనగర్: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్. గౌతమ్‌రావును బీజేపీ నగర కార్యాలయంలో బౌద్ధనగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావును సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కనకట్ల హరి, అధికార ప్రతినిధి ప్రభుగుప్తా ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


నర్సిరెడ్డి

బౌద్ధనగర్: ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. బౌద్ధనగర్ ప్రాంతానికి చెందిన నర్సిరెడ్డి(36) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 6న ఉద్యోగానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన నర్సిరెడ్డి మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో అతని తల్లి రాఘవమ్మ బుధవారం వారాసీగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కేసు నమోదు

అమీర్‌పేట: యువకుడిపై బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ బాపట్లకు చెందిన 26 ఏళ్ల యువతి బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని ఓ సంస్థలో పనిచేస్తుంది. తుమ్మలగుంట విద్యాసాగర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం కాస్త.. కొన్నాళ్లకే ప్రేమగా మారింది. పెండ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. ఏకాంతంగా ఉన్నప్పుడు తీసిన నగ్న చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరిస్తున్నాడని పేర్కొంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీజే శబ్దాలు.. ఇద్దరిపై కేసు నమోదు

సనత్‌నగర్: అధిక శబ్దాలతో డీజే ప్లే చేస్తూ ప్రజలను ఇబ్బందులు గురిచేస్తున్న ఇద్దరు నిర్వాహకులపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ సమతానగర్‌కాలనీలో మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో గణేశ్ ఊరేగింపు నేపథ్యంలో డీజే ప్లే చేస్తూ స్థానికంగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిర్వాహకులు హర్షవర్ధన్, నరసింహలను అనుమతి పత్రాలను చూపించాలని కోరారు. దీంతో అనుమతి పత్రాలు చూపించకపోవడంతో ప్రజలను ఇబ్బందులు గురిచేసినందుకు ఇరువురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా వేణుగోపాల్‌రెడ్డి



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా వేణుగోపాల్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉస్మానియా ఆస్పత్రి ఫార్మసీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై గాంధీకి బదిలీ అయ్యారు. గాంధీ ఇన్‌చార్జి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేసిన మధుసుధాకర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా డిస్ట్రిక్ ఫార్మసీ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు.